ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

శనివారం 15 మార్చి 2025



నేడు మల్యాల మండలంలో

కేంద్ర మంత్రి పర్యటన

మల్యాల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం మల్యాల మండలంలో పర్యటించనున్నారు. బల్వంతాపూర్‌లో సీసీ రోడ్ల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశం తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రంగుల కేళి..హోలీ

- వేడుకల్లో కలెక్టర్ , ఎస్పీ , నాయకులు, అధికారులు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా సంబరాలు



హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ, పోలీస్ అధికారులు



వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ అశోక్ కుమార్



సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్



జగిత్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే వీధుల్లో సందడి నెలకొంది. చిన్నారులు, యువతీ, యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. డప్పుచప్పుళ్లతో ఊరే గింపుగా వెళ్తూ స్వీట్లు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. జగిత్యాలలో కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ బీఆఎస్ లత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా అశోక్ కుమార్‌తో పాటు పోలీస్ అధికారులు, మాజీ జడ్పీ, మున్సిపల్ చైర్ పర్సన్లు దావ వసంత, అడు వాల జ్యోతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి తదిత రులు వేడుకల్లో పాల్గొన్నారు. హోలీ హోలీల రంగ హోలీ.. చెమ్మకేలీన హోలీ.. రంగ్ బరసే.. హోలీ ఆయారే.. అంటూ జిల్లా వ్యాప్తంగా శుక్ర వారం నిర్వహించిన హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా కేంద్రంలోని వీధులన్నీ రంగుల హరివిల్లులను తలపించాయి. ఎటు చూసినా రంగులమయమే అనిపించింది. రహదారులు సైతం రంగుల మయమయ్యాయి. ఉదయం నుంచే ఉరకలేసిన ఉత్సాహంతో వయస్సుతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల ప్రజలు రంగులు తీసు కునివీధుల్లోకి వచ్చారు. కుర్రకారు హుషారుగా బైక్‌లపై షికార్లు చేస్తూ రంగులను చల్లుకున్నారు. కేరింతలు కొడుతూ పోటీతత్వంతో ఒకరిపైఒకరు పడి రంగులు పులుముకున్నారు. బిగ్గరగా హోలీ అని అరుస్తూ టమాటలు, కోడిగుడ్లను తలపై, శరీర భాగాలపై పగుల గొట్టుకున్నారు. ఆత్మీయంగా అలింగనం చేసుకుని స్వీట్లు తినిపించు కుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



హోలీ వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జ్యోతి

హోలీ పండుగ ఐక్యతకు చిహ్నం - ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

హోలీ పండుగ ఐక్యతకు చిహ్నమని, జాతీయ సమైఖ్యతాభావంతో దేశంలో జరుపుకునే సంబరాల్లో హోలీ ఒకటని పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. హోలీ పండుగ తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. రసాయన మందులు వాడకుండా ప్రకృతి సహజ రంగులు చల్లుకోవాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేదకు అందించడమే మా లక్ష్యమన్నారు.

జిల్లా ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలి.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. హోళి వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జగిత్యాల నియోజకవర్గ ప్రజాప్రతినిధులతో కలిసి హుషారుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను నేరవేర్చుతుందన్నారు.

సోదరభావానికి ప్రతీక హోలీ.. ఎస్పీ అశోక్ కుమార్

సోదరభావానికి ప్రతీక హోలీ పండుగ అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో కలిసి ఎస్పీ హోలీ సంబరాల్లో పాల్గొని మాట్లాడారు. హోలీ వేడుకలు సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు చిన్ననాటి తీపి గుర్తులను గుర్తు చేశాయన్నారు. రంగులు ఎలా కలుస్తాయో మనుషులు కూడా ఐక్యతభావంతో మెలగాలని అన్నారు.

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి

- జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను అసెంబ్లీలో ఎత్తి చూపడంతోనే సస్పెండ్ చేశారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి మద్దతుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా అడ్డుకునే యత్నంలో భాగంగా జగదీష్‌రెడ్డిని కుట్రపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలను తిప్పికొడుతామన్నారు. ఈ కార్యమంలో బీఆర్ఎస్ నాయకులు సందీప్ రావు, షైపాల్‌రెడ్డి, ప్రవీణ్, ఉదయశ్రీ, రాణి, ఆనంద రావు, మల్లేశం, గంగాధర్, సత్యం రావు ఉన్నారు.

జగిత్యాలలో పోలీసుల తనిఖీలు



జగిత్యాలలో తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జిల్లా కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జగిత్యాల పట్టణంలో పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న గస్తీని ప్రత్యక్షంగా పరిశీలించారు. దొంగతనాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వేణు గోపాల్, ఎస్సైలు గీత, మన్మధరావు, కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ధర్మపురిలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం



త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభిస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం చుట్టు ఉదయం కళాకారులు, లక్ష్మీ నరసింహ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి మంగళ వాయిద్యాలు వెంట రాగా చాచం కిష్టయ్య వేషాధారణతో త్యాగరాజ చిత్రపటంతో ప్రదక్షిణాలు, నగర సంకీర్తన చేశారు. అనంతరం శేషప్ప కళావేదికపై ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్ త్యాగరాజు, చాచం కిష్టయ్య చిత్రపటాలకు పూల మాల వేసి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంగనభట్ల నర్సయ్యశర్మ ధర్మపురి వాస్తవ్యులు చాచం కిష్టయ్య జీవిత చరిత్ర గురించి వివరించారు. అనంతరం సంగీత విద్వాంసులు నరహరి, సతీష్‌కుమార్ పంచరత్న గానాలు ఆలపించారు. రాత్రి వేళలో శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులు భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

అనభేరి సేవలు చిరస్మరణీయం



అనభేరి ప్రభాకర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య సమర యోధుడు అనబేరి ప్రభాకర్ సేవలు చిరస్మరణీయమని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. శుక్రవారం పట్టణంలో కళానగర్ ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో అనభేరి ప్రభాకర్ వర్ధంతి నిర్వహించారు. అనభేరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుల రాజేందర్ రావు, బాస నర్సింగ్ రావు, జాజాల రాజ్‌గోపాల్‌రావు, తూం రాజేందర్, బాస శ్రీనివాస్, వెల్మల ప్రభాకర్, గంట హన్మంతు, గాదె వెంకటేశ్వర్లు, తేలు లక్ష్మణ్, వెల్మల రవీందర్ పాల్గొన్నారు.

నేడు కోరుట్ల డిపో పరిధిలో డయల్ యువర్ డీఎం

కోరుట్ల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల డిపో పరిధిలోని పట్టణాలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు డయల్ యువర్ డీఎంను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం కోరారు. ఈ నెల 15వ తేదీన నిర్వహించు డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించాలని సూచించారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజలు 8374534961 నంబర్‌కు ఫోన్ చేసి స్పందించాలని డీఎం సూచించారు.

గ్రూప్-3 ఫలితాల్లో 103 ర్యాంకు



అరవింద్ రెడ్డి

రాయికల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన సురతాని మల్లారెడ్డి-భాగ్యలక్ష్మి కుమారుడు అరవింద్ రెడ్డి గ్రూప్-3 ఫలితాల్లో సత్తా చాటాడు. ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షలో విజయం సాధించిన అరవింద్ తాజాగా ప్రకటించిన గ్రూప్-3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 103వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా అరవింద్‌ను పలువురు విద్యావేత్తలు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచనలో మొదటి స్థానం



సాత్వికకు ప్రశంసాపత్రం, బహుమతి అందిస్తున్న వేళాయేశ్వర్

మల్లాపూర్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో మొదటి విజేతగా మండలంలోని కొత్తధాంరాజుపల్లి గ్రామంలోని కేరళ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సాత్విక నిలిచింది. శుక్రవారం శ్రీసత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ర్యాగల్ల వేళాయేశ్వర్ బహుమతి, ప్రశంసా పత్రాన్ని సాత్వికకు అందజేశారు. ఈ సందర్భగా మారుమూల ప్రాంతానికి చెందిన విద్యార్థి సాత్విక ప్రతిభ కనబరిచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల కరస్పాండెంట్ సిబి అనిల్‌సింగ్, నాయకులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ విద్య.. మరింత మెరుగ్గా



- జిల్లాలో 48 మంది అధ్యాపకుల నియామకం
- తొలగనున్న బోధన ఇబ్బందులు
- విద్యార్థులు లేని కళాశాలలకు సైతం కేటాయింపు
- ప్రవేశాలు పెంచేందుకు కసరత్తు

జగిత్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లెక్చరర్లు లేక ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వం నియామకపత్రాలు అందించడంతో నూతన లెక్చరర్లు జూనియర్ కళాశాలల్లో చేరారు. కొన్నేళ్ల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో పూర్తి స్థాయిలో బోధకులు లేక అతిథి, ఒప్పంద లెక్చరర్లతో అంతంత మాత్రంగానే బోధన సాగుతోంది. ఎట్టకేలకు సుమారు 13 సంవత్సరాల కల ఫలించింది. జిల్లాకు 48 మంది కొత్త లెక్చరర్లను ప్రభుత్వం కేటాయించింది. రెండు రోజుల క్రితం హైద్రాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. జిల్లాలో కేటాయించిన స్థానాల్లో వారు విధుల్లో చేరారు.

జిల్లాలో ఇంటర్ కళాశాలలు

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు కస్తూర్బా, ఇతర గురుకుల జూనియర్ కళాశాలలు 47 వరకు ఉన్నాయి. ఇందులో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 13 మోడల్ కళాశా లలు, 5 మైనార్టీ జూనియర్ కళాశాలలు, 5 కస్తూర్బా జూనియర్ కళాశాలలు, 3 మహాత్మాజ్యోతిరావు బాపులే జూనియర్ కళాశాలు, 6 గురుకుల జూనియర్ కళాశాలలున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు సుమారు 9 వేలకు పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు.

అదే విధంగా సుమారు రెండు వేల వరకు రెసిడెన్షియల్, మైనార్టీ, బీసీ తదితర జూనియర్ కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయి.



రెగ్యులర్ నియామకాలు లేక ఇబ్బందులు

ప్రభుత్వం గత 13 సంవత్సరాలుగా కొత్తగా లెక్చ రర్ల నియామకాలను ప్రభుత్వాలు చేపట్టలేదు. బీఆర్ ఎస్ సర్కారు హయాంలో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేసినప్పటికీ పలు కళాశాలల్లో ఖాళీగా ఉంటునే ఉన్నాయి. ప్రస్తుతం కొత్తగా సుమారు 13 సంవత్సరాల తదుపరి ప్రభుత్వం కొత్తగా లెక్చరర్ల పోస్టులను భర్తీ చేసింది. దాదాపు జిల్లాలో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. జిల్లాలో 48 మంది లెక్చరర్లను ప్రభుత్వం నియామకం చేసింది. జిల్లాలో 206 లెక్చరర్ల పోస్టులు మంజూరు అయ్యాయి. ఇందులో 182 జనరల్ లెక్చ రర్లు, 24 ఉర్దూ మీడియం లెక్చరర్ పోస్టులు న్నాయి. జగిత్యాల బాలుర జూనియర్ కళాశాలలో ఉర్దూ లెక్చరర్, హిందీ లెక్చరర్ పోస్టులు విద్యార్థులు లేకు న్నా నియామకం చేశారు. సారంగాపూర్ కళాశాలలో హిందీ సబ్జెక్టుకు విద్యార్థులు లేకున్నప్పటికీ ప్రస్తుతం సంబందిత హిందీ లెక్చరర్‌ను నియామకం చేశారు. ఆయా కళాశాలల్లో సంబంధిత సబ్జెక్టుల్లో విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశం పొందేలా ప్రయ త్నాలు చేస్తున్నారు.

2022 డిసెంబరులో నోటిఫికేషన్

గత 2014, 2016, 2019, 2021 సంవత్సరాల్లో అర్హులైన వారికి పదోన్నతులు మాత్రమే కల్పించగా ఇంటర్ బోర్డు మూడేళ్ల క్రితమే జూనియర్ కళాశాలల్లో ఖాళీలను గుర్తించి..

మిగతా 8లో

సబ్జెక్టుల వారీగా నియామకాలు

బాటనీ..4
బాటనీ(ఉర్దూ)2
ఎకనామిక్స్..2
ఎకనామిక్స్(ఉర్దూ)1
కామర్స్(ఉర్దూ)1
కామర్స్..1
మ్యాథ్స్..3
హిస్టరీ...3
సివిక్స్(ఉర్దూ)...2
సివిక్స్..1
ఇంగ్లీష్..6
కెమిస్ట్రీ....4
ఉర్దూ...2
కామర్స్..5
జువాలజీ..4
ఫిజిక్స్..5
హిందీ..6

కళాశాలల వారీగా కొత్త అధ్యాపకులు

జగిత్యాల బాలురు...7
జగిత్యాల బాలికలు..7
ఇబ్రహీంపట్నం4
కోరుట్ల....7
కోరుట్ల బాలికలు2
బీర్‌పూర్.1
ధర్మపురి...4
గొల్లపల్లి..1
కొడిమ్యాల...2
మల్యాల...1
మల్లాపూర్...3
సారంగపూర్...5
మెట్‌పల్లి...3
రాయికల్...1
మొత్తం 48

మార్చిలోనే మండుతున్న ఎండలు

- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వెల్గటూర్, అయిలాపూర్‌లో గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు నమోదు

జగిత్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతోంది. శుక్రవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 36.2 డిగ్రీలుగా నమోదైంది. జిల్లాలో అత్యధికంగా వెల్గటూరు, కోరుట్ల మండలం అయిలాపూర్‌లలో 40.3, పెగడపల్లి, బుగ్గారం మండలం సిరికొండ, ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లలో 40.2 డిగ్రీలు, అత్యల్పంగా బీమారం మండలం గోవిందారంలో 36.2, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 37.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో ఈనెల 10వ తేదీన 38.6 డిగ్రీలు, 11వ తేదీన 39.1 డిగ్రీలు, 12వ తేదీన 40.3 డిగ్రీలు, 13వ తేదీన 39.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్న సమయంలో అత్యవరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ అధికమై ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం, వడగాలుల ప్రభావంతో బయటకు రావడానికే జంకుతున్నారు. ఈ సమయాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. కొద్ది రోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితి ఉండగా వడగాలులు తోడు కావడంతో రోజువారీ పనులతో జీవనం సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రత మరింత పెరిగే అవకాశాలున్నందున అందుకు తగ్గట్లుగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. మధ్యాహ్న సమయంలో ప్రజలు పనులను వాయిదా వేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఇక వృద్ధులు, చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవాలని అధికారులు చెబుతున్నారు.





జగిత్యాలలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన చౌరస్తా , జగిత్యాల బైపాస్ రోడ్డు

వినియోగదారుడా.. మేలుకో..

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం




గణేశ్‌నగర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు ఎన్నో హక్కులు ఉన్నాయి. ఈ విషయం తెలియక చాలా మంది ఎన్నో విధా లా నష్టపోతున్నారు. వినియోగ దారుల హక్కులను పరిరక్షిస్తూ అవగాహన కల్పించేందుకు కన్స్యూమర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మార్చి 15న జరుపుకునే ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహిస్తారు. 1983 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం థీమ్ స్థిరమైన జీవనశైలికి న్యాయమైన పరివర్తన. అన్యాయమైన మార్కెట్ విధానాలు,తప్పుదారి పట్టించే ప్రకటనలు, అసురక్షిత ఉత్పత్తుల నుంచి కొనుగోలుదారులను రక్షించడం. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా, ప్రజలు తమ హక్కుల గురించి అవగాహన కల్పించడానికి కార్యకర్తలు, సంస్థలు, ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తాయి.

వినియోగదారుల హక్కుల రక్షణ కార్యక్రమాలు

భారత ప్రభుత్వం వినియోగదారులకు సాధికారత కల్పించడానికి, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. భారతదేశంలో వినియోగదారుల హక్కులను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన కొన్ని కీలక చర్యలు వినియోగదారుల రక్షణ చట్టం 2019లో పొందుపరిచారు.

- వేగవంతమైన పరిష్కారం కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను దాఖలు చేయడానికి ఈ-దాకిల్ పోర్టల్ అనే డిజిటల్ వేదికను ఏర్పాటు చేసింది.
- కేంద్ర వినియోగదారుల రక్షణ అథారిటీ (సీసీపీఏ) - అన్యాయమైన వాణిజ్య పద్ధతులను నియంత్రిస్తుంది, పరిష్కరిస్తుంది.
- జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్)- వినియోగదారుల ఫిర్యాదులు,సహాయం కోసం టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ (1800-11-4000)

జాగో గ్రాహక్ జాగో ప్రచారం - వినియోగదారులకు వారి హక్కుల గురించి అవగాహన కల్పించే దీర్ఘకాలిక అవగాహన కార్యక్రమం.
బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) సర్టిఫికేషన్ - వినియోగదారు వస్తువుల నాణ్యత, భద్రత కోసం ఏర్పాటు చేశారు.


రుద్రవరం-గొల్లపల్లి వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు

'డేంజర్ జోన్'గా
మూడు గ్రామాల కూడలి

- తరచూ రోడ్డు ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న స్థానికులు
- స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

వేములవాడ టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ నుంచి కరీంనగర్ వెళ్లే రోడ్డు మార్గంలోని రుద్రవరం ఆర్‌అండ్ఆర్ కాలనీ ప్రాంతంలో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. రుద్రవరం, సంకెపల్లి, గొల్లపల్లి గ్రామాలు ఒకేచోట ఉండటంతో రోడ్డుపై జనసంచారం ఎక్కువగా ఉంటుంది. వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి కరీంనగర్, వరంగల్, హన్మకొండ ప్రాంతాల నుంచి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వందలాది వాహనాలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. అయితే ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, గొల్ల పల్లి, అనుపురం గ్రామాలు కలిసి ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంకెపల్లి గ్రామ సమీపంలో రోడ్డు మూలమలుపు ఉండటంతో కరీంనగ ర్ నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు రోడ్డును దాటేందుకు ప్రయత్నిస్తున్నా రు. ఈక్రమంలో నిత్యం ఒకరు రోడ్డుప్రమాదం బారిన పడుతున్నారు. ఇటీవల గొల్లపల్లి గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి వైపు రోడ్డు దాటేందుకు ప్రయత్నించగా అటుగా వస్తు న్న ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. ఈ సంఘటన లో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటన మరువక ముందే గ్రామానికి చెందిన తిరుపతి-స్వప్న దంపతులు రోడ్డుదాటే క్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కిందపడి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంకెపల్లి నుంచి అనుపురం వరకు స్పీడ్ బ్రేక్‌లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణాలతో బయటపడ్డాం..
బొల్లు తిరుపతి, గొల్లపల్లి



సంకెపల్లి గ్రామం నుంచి గొల్లపల్లికి వెళ్లే క్రమంలో బస్సు ఢీకొట్టింది. బస్సు టైర్ కిందపడి నలిగిపోయే వాళ్లం. అదృష్టవ శాత్తు త్రుటిలో ప్రమాదం తప్పి గాయాలతో బయటపడ్డాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల వేగా న్ని నియంత్రించేలా చర్యలు తీసుకోవాలి.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి..
కాచం నిఖిల్, సంకెపల్లి



రుద్రవరం, సంకెపల్లి గ్రామాల మధ్య రోడ్డు దాటుదామంటే భయం వేస్తోంది. వాహనాలు అత్యంత వేగంగా వస్తున్నాయి. వాహనాల వేగం తగ్గించేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.



సంకెపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు(ఫైల్)

తేనెటీగల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన దుబ్బాక రజిత-నర్సయ్య దంపతులు, కుమార్తె సమ్మెట శ్రీజ-సమ్మెట మహేందర్ వేర్వేరు మోటార్ సైకిళ్లపై తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గ్రామంలో జరిగే జాతరకు వెళుతున్నారు. మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామశివారులో గల కాకతీయ ప్రధాన కాల్వనుంచి వెళుతుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో నలుగురికి తీవ్రగాయాలుకాగా 108లో క్షతగాత్రులను హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ మోటార్ చోరీ

శంకరపట్నం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ గ్రామశివారులో ఎస్సారెస్పీ ఉపకాలువకు ఓ రైతు బిగించిన వ్యవసాయమోటర్ గురువారం అర్ధరాత్రిచోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికిచెందిన నాయినిశ్రీనివాస్ మొలంగూర్ గ్రామశివారులో రెండెకరాల వ్యవసాయభూమి కౌలుకుతీసుకొని సాగుచేసుకుంటున్నాడు. వ్యవసాయబావిలో అంతంత మాత్రంగానేనీరు ఉండడంతో ఎస్సారెస్పీ ఉపకాలువకు వ్యవసాయమోటర్ బిగించి వరిపొలాన్ని పారిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున మోటార్ పెట్టేందుకు వెళ్లగా ఉపకాలువకు బిగించిన విద్యుత్ మోటర్‌కనిపించలేదు. గురువారం అర్ధరాత్రి దొంగలు మోటర్‌నుదొంగలించినట్లు కౌలు రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు.

సెల్‌ఫోన్ల దొంగకు జైలుశిక్ష

వేములవాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్లు దొంగలించిన ఘటనలో ఓ నిందితుడికి ఎనిమిది మాసాల జైలు శిక్ష, 100 రూపాయల జరిమానా విధిస్తూ వేములవాడ న్యాయస్థానం తీర్పు చెప్పినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌పట్టణానికి చెందిన రాథోడ్‌బాలాజీ, వేములవాడకు చెందిన మంజీడి రాజయ్య అనే ఇద్దరినుంచి తంగళ్లపల్లికి చెందిన ఎండి ఇర్ఫాన్ రెండు సెల్‌ఫోన్‌లను చోరీ చేయగా 2024 జూన్ నెలలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదయ్యాయని తెలిపారు. రెండు కేసులలో నిందితుడిని రిమాండ్ చేశామని, విచారణ అనంతరం విచారణ అధికారి అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారన్నారు. సీఎంఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో న్యాయస్థానంలో సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరపున విక్రాంత్ కేసు వాదించగా, పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నిందితుడికి 8 నెలల కారాగార జైలుశిక్ష, 100 రూపాయల జరిమానా విధించిందని పేర్కొన్నారు.

అక్రమంగా డబ్బులు డ్రా చేసిన ఇద్దరి అరెస్టు

మంథని, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని ధర్మారం (గద్దలపల్లి) గ్రామానికి చెందిన కందుకూరి లక్ష్మి బ్యాంక్ అకౌంట్‌లోని రూ.4,49,000లను అక్రమంగా డ్రాచేసిన కేసులో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌కు చెందిన దామెరకుంట అశోక్, గుండ్ర ప్రశాంత్ కుమార్‌ను అరెస్టు చేసిన రిమాండ్ పంపినట్లు సీఐ రాజు శుక్రవారం తెలిపారు. లక్ష్మి కుమారుడు చనిపోగా అతని అకౌంట్‌లో ఉన్న రూ. 4,49,000లను గత ఏడాది ఏప్రిల్ 25నఎస్‌బీఐ అకౌంట్‌లోకి బదిలీ చేయించుకుంది. ఈ డబ్బులను సెప్టెంబర్ 4న డ్రా చేసుకోవటానికి బ్యాంక్ వెళ్లగా అకౌంట్‌లో డబ్బులు లేవని చెప్పడంతో ఆమె మంథని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా నిందితులను గుర్తించామన్నారు. అశోక్ తన పేటీఎం యాప్‌కు లక్ష్మి బ్యాంక్ అకౌంట్ అనుసంధానం చేసి డబ్బులు డ్రాచేసుకొని ప్రశాంత్‌కుమార్ తో కలిసి కుటుంబ అవసరాలు, జల్సాలకు వాడుకున్నట్లు తెలిపారు. నిందితులు నేరం ఒప్పుకోవడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించామన్నారు. ఎస్ఐ రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్


నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ జాన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న నేపాల్‌కు చెందిన బహదూర్ భగత్ హత్య కేసులో నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు కరీంనగర్ త్రీటౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇంటర్నెట్ వైఫై పాస్‌వర్డ్ వివాదంలో వర్కర్స్ మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో బహదూర్ భగత్‌ను కర్రలతో కొట్టడంతో తీవ్రగాయాలవగా గురువారం మృతిచెందాడు. భగత్‌పై దాడిచేసిన ఘటనలో నిందితులు నేపాల్‌కు చెందిన జగదీష్ సింగ్, బహదూర్ శంకర్‌సింగ్, భరత్‌సింగ్, దీపక్, కృష్ణసింగ్‌ను కార్ఖానగడ్డ ప్రాంతంలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చందుర్తి అడవిలో పులి సంచారం

చందుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందుర్తి, మల్యాల, తిమ్మాపూర్ పరిసర అటవీప్రాంతాల్లో పులి సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయాగ్రామాల్లోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చందుర్తి, మల్యాల అటవీ క్షేత్రాధికారి ఎమ్ కలీలొద్దీన్ పేరిట సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలు,పశువుల,మేకలకాపరులు అడవిలోకి వెళ్లవద్దని, వ్యవసాయ భూములవద్ద, పొలాల చుట్టూ కరెంట్ తీగలు పెట్టవద్దని, ఎవరైనా ఏ విధంగానైనా పులికి హాని తలపెట్టాలని ప్రయత్నిస్తే చట్టరీత్యా కఠినశిక్ష విధించబడుతుందని పోస్టర్‌లో పేర్కొన్నారు. పులి సమాచారంతెలిస్తే వెంటనే తెలపాలని కోరారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి అదృశ్యం


లక్ష్మయ్య(ఫైల్)

కమాన్‌పూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం అల్లీపూర్(రేగడిమద్దికుంట)గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు నముండ్ల లక్ష్మయ్య మంగళవారం సాయంత్రం అదృశ్యమయ్యాడు. గోదావరిఖని పట్టణంలోని సింగరేణి సంస్థ 7ఎల్ఈపీ బొగ్గు గనిలో పనిచేస్తు 2013లో పదవి విరమణ పొందాడు. అనంతరం సొంతూరు అల్లీపూర్‌లో స్థిరపడ్డాడు. ఇటీవల అతనిభార్య మరణించడంతో అల్లీపూర్‌నుండి కమాన్‌పూర్ మండలంలోని రొంపికుంటలోని కూతురు పులిపాక పుష్ప ఇంటికి పదిహేను రోజుల క్రితం వచ్చాడు. మార్చి 11న మంగళవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు కమాన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమాకీతెలిసిన వారు నంబర్‌కు 87126 56523కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల నంబర్లు 7981756443చ 7989574705లలో కూడా సమాచారం ఇవ్వాలని కోరారు.

మాజీ సర్పంచ్ అదృశ్యం: కేసు నమోదు


దేవక్క(ఫైల్)

కోరుట్ల రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామ మాజీసర్పంచ్ పూదరి దేవక్క(72) అదృశ్యం అయినట్లు కోరుట్ల పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. దేవక్క శుక్రవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. దేవక్క కొన్నిరోజులుగా మతి స్థిమితం కోల్పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి ఎస్ఆర్ఎస్‌పీ ప్రధాన కాల్వ వద్ద దేవక్క పర్సుతోపాటు ఆమె చెప్పులు లభించినట్లు సమాచారం. పోలీసులు ఆ కోణంలో విచారణ చేపట్టారు.

బైక్ నడిపి ప్రమాదానికి కారణమైన బాలుడిపై కేసు

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): బైక్ నడిపి ఇద్దరిని గాయపరిచిన బాలుడు, అతనికి బైక్ ఇచ్చిన తండ్రిపై కేసునమోదు చేసినట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... కోరుట్లకు చెందిన బొజ్జరాజేశం తనభార్యతో కలిసి వేములవాడకు వెళ్తుండగా సిరికొండకు చెందిన ఓబాలుడు బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో భార్యాభర్తలకు తలకు,కాలుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు సిరికొండకు బాలుడు, అతని తండ్రిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు. అసెంబ్లీలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డిని శాసనసభ సమావేశాల వరకు సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ వెంటనే సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎలాంటి అనుమతి లేకుండా వాహనదారులను అడ్డుకొని వారికి ఇబ్బంది కలిగించిన ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేసి ధర్నా చేసిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై శుక్రవారం కేసు నమోదు చేశామని తెలిపారు.

పాముకాటుతో పాడి గేదె మృతి

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరులో బాస గంగారెడ్డి అనే రైతుకు చెందిన పాడి గేదె శుక్రవారం పాము కాటుతో మృతి చెందింది. గంగారెడ్డి గేదెను పశువుల కొట్టంలో ఉంచి ఉదయం మేత వేసి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం పశువుల కొట్టం వద్దకు వెళ్లి పాము కాటుతో గేదె మృతి చెందినట్లు గుర్తించాడు. గేదె మృతితో రు.80 వేల నష్టం జరిగిందని బాధిత రైతు విలపించాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని మాజీ సర్పంచ్ గుండారపు గంగాధర్ కోరారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

- పండుగపూట విషాదం


సాగర్‌గౌడ్ (ఫైల్)

జగిత్యాలరూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం వెల్దుర్థి-బావోజీపల్లె శివార్లలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో ఈతకు వెళ్లి గొల్లపల్లి సాగర్‌గౌడ్(32) అనేయువకుడు మృతిచెందాడు. శుక్రవారం హోలీవేడుకల్లో భాగంగా సాగర్ తన మిత్రులతో కలిసి సంబరాలు జరుపుకున్నాడు. అనంతరం గ్రామశివారులోగల ఎస్సారెస్పీ కెనాల్‌లో మిత్రులతో కలిసి స్నానం చేయడానికి వెళ్లాడు. సాగర్‌కెనాల్‌లో దూకడంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండి గల్లంతయ్యాడు. ఘటన స్థలానికి చేరు కొని పోలీసులు యువకుడి మృతదేహం కోసం గాలించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో సుమారు రెండు గంటలకుపైగా సాగర్‌గౌడ్ ఆచూకీ లభించలేదు. కెనాల్‌నీటి ప్రవాహం తగ్గించి వెతకగా కొంతదూరంలో చెట్టుకు మృతదేహం తట్టుకొని కనిపించింది. దీంతో సాగర్ మృతదేహాన్ని కెనాల్‌లో నుంచి బయటికి తీసి జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెల్దుర్థి గ్రామానికి చెందిన సాగర్ జగిత్యాలలో పాలడెయిరీ నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. హోలీ సందర్భంగా తనస్వగ్రామం వెల్దుర్థికి వచ్చి వేడుకల్లో పాల్గొ న్నాడు. ఈక్రమంలోనే సాగర్ మృత్యువాతపడడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. మృతుడు సాగర్‌కు భార్య వెన్నెల, కుమా రుడు, కూతురు ఉన్నారు. ఘటనస్థలానికి చేరుకొని జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ వివరాలు సేకరించారు. కేసు విచా రణ చేపట్టారు. బాధిత కుటుంబాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామ ర్శించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు మృతి

ఇల్లందకుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామసమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం కొత్తపల్లి గ్రామానికిచెందిన అనుదీప్(17) చిన్నకోమటిపల్లి గ్రామానికిచెందిన తనస్నేహితుడి ఇంటికి వచ్చి తిరిగివెళ్తున్న క్రమంలో బైక్‌అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అనుదీప్ పక్కనే ఉన్న బండరాయికి తల తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి


వామిక (ఫైల్)

చందుర్తి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రానికి చెందిన మర్రి నిశాంత్-వీణ దంపతుల కుమార్తె వామిక (16నెలలు) అనే చిన్నారి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. వామిక పది రోజులనుంచి బ్లడ్‌ఇన్ఫెక్షన్‌తో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వామికను బతికించడం కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేసి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది.

ఏటీఎంలోకి దూసుకెళ్లిన కారు

రామగిరి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీకాలనీ ఎస్‌బీఐ ఏటీఎంలోకి టీఎస్ 22సి 3614 నంబరు గల కారు శుక్రవారం దూసుకెళ్లింది. ఏటీఎం షెడ్ గద్దెకు ఢీకొని కారు నిలిచిపోయింది. ఈ ఘటనలో కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న సింగరేణి ఉద్యోగికి ప్రమాదం తప్పింది. ఘటనా స్థలాన్ని ఎస్ఐలు చంద్రకుమార్, దివ్య, పోలీసు సిబ్బంది పరిశీలించారు.


ఏటీఎమ్ గదిని ఢీకొని ఆగిన కారు

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్ట్

వేములవాడ, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో పట్టణానికి చెందిన రత్నయ్య, లాడ్జి ఓనర్ విజయ్ కుమార్‌తో కలిసి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. ఓ విటుడుతో పాటు నిర్వాహకుడు రత్నయ్యలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రత్నయ్యను శుక్రవారం రిమాండ్‌కు తరలించగా, విజయ్‌కుమార్ పరారీ ఉన్నాడని తెలిపారు.

మానేరు వంతెన పైనుంచి పడి యువకుడికి గాయాలు

ఓదెల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంపుల మానేరు వంతెన పైనుంచి పడి రామగిరి మండలం కాసిపల్లికి చెందిన అబ్బు కార్తీక్ రెడ్డి అనే యువకుడు తీవ్ర గాయాలకు గురయ్యాడు. హన్మకొండ నుంచి సొంత గ్రామమైన కాసిపేటకు ద్విచక్ర వాహనం పై వేగంగా వస్తుండగా పక్కనున్న డివైడర్‌కు ఢీకొనడంతో పైనుంచి మానేరు వాగులో పడిపోయాడు. ఈ సంఘటనలో తీవ్రగాయాలకు గురైన కార్తీక్ రెడ్డిని 108లో జమ్మికుంటలోని హాస్పిటల్‌కు తరలించారు.

థాయ్‌లాండ్‌కు పంపిస్తానని చెప్పి మోసం చేసిన ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట థాయ్‌లాండ్ పంపిస్తానని మోసం చేసిన హైదరాబాద్‌లోని వనస్థలిపురం సమీపంవద్ద గల ఎస్‌కేడీనగర్‌కు చెందిన బొమ్మ రఘువసంత్ కుమార్ (32), దాసరి ఎక్నాథ్‌గౌడ్(29) అనేఇద్దరు ఏజెంట్లను శుక్రవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పట్టణం వెంకంపేటకు చెందిన కల్ల అరవింద్ అనే నిరుద్యోగ యువకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ఇద్దరు ఏజెంట్లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు. ఎవరూ గుర్తుతెలియని ఏజెంట్లను, మధ్యవర్తులను నమ్మి డబ్బులు వృథా చేసుకోవద్దని, విదేశాలకు వెళ్లాలనుకునే వారుంటే లైసెన్స్‌డ్ ఏజెంట్లని సంప్రదించాలన్నారు. కంపెనీ విసాపై మాత్రమే వెళాలని, ఫ్రీవిసాపై వెళితే ఇబ్బందులు పడుతారని తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

సోషల్ మీడియా పోస్టులపై చర్యలు తీసుకోవాలి

- మెట్‌పల్లిలో పోలీసులకు ఎన్ఎస్‌యూఐ నాయకుల ఫిర్యాదు


ఎస్సై కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచేలా సోషల్‌మీడియాలో బీఆర్ఎస్‌వీ నాయకుల పోస్టుల వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మెట్‌పల్లిలో పోలీసులకు ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బీర్కుల విజయ్ ఫిర్యాదు చేశారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కిరణ్ కుమార్‌ను కలిసి ఫిర్యాదుపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిని అగౌరవ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్‌వీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ బీర్కుల విజయ్‌తోపాటు వైస్ ప్రెసిడెంట్ పోల్కం శివ, నాయకులు సమీర్ సర్కార్, ఖాజా అజీం, వాల్గొట్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన గుడిసె: తప్పిన ప్రమాదం

సారంగాపూర్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): పూరిగుడిసె కూలడంతో అందులో నివాసం ఉంటున్న కుటుంబానికి ప్రమాదం తప్పింది. సారంగాపూర్ మండలకేంద్రానికి చెందిన తునికిచారి నివాసముండే పూరిగుడిసె శుక్రవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రభుత్వం తమకు ఆర్థికసాయం అందించి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని అధికారులను, ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా వేడుకున్నాడు.


కూలిన గుడిసె

వేములవాడలో ఘనంగా డోలోత్సవం



స్వామివారికి డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో డోలోత్సవం ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మండపంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ గావించిన అర్చకులు వేదమంత్రాల మధ్య వైభవంగా డోలోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● రాజన్నను దర్శించుకున్న మంత్రి సతీమణి

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని శుక్రవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సతీమణి పద్మిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదబ్రాహ్మణులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కొండగట్టు గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా భక్తులు కొండగట్టు గిరి ప్రదక్షిణను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరుకు చెందిన సురేశ్ ఆత్మారాం శర్మ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరిప్రదక్షణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సాగింది. వందలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రదక్షిణ ముగిసిన అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు.

డ్రైవింగ్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డ్రైవింగ్ కోర్సులో ఉచిత శిక్షణకు ఆసక్తి ఉన్న బీసీ యువతీ, యువకులు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ బీసీ యువతీ యువకులకు హెవీ మోటార్ వాహనం, తేలికపాటి మోటార్ వాహనం డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తారన్నారు. హకీంపేటలో 38 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు లైసెన్స్ అందిస్తామని తెలిపారు. అభ్యర్థులకు ఉచిత భోజనం వసతి సౌకర్యం ఉంటుందన్నారు. హెవీ మోటార్ వెహికల్‌కు 20 నుంచి 45, తేలికపాటి మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు 18 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. ఎనిమిదో తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, లెర్నింగ్ లైసెన్స్‌తో ఈనెల 15 నుంచి 31 సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన సూచించారు.

సాగునీటి కోసం రైతుల నిరసనదీక్ష

ఇల్లంతకుంట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ పనులు పూర్తి చేయాలని రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష కొనసాగుతోంది. ఎల్ఎమ్ 6 కెనాల్ పనులు పూర్తి చేయాలని చేపట్టిన నిరసనదీక్ష శుక్రవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న మహిళా రైతులు మాట్లాడుతూ అందురూ హోలి వేడుకల్లో పాల్గొంటుండగా.. పంటలు ఎండిపోతున్న తాము మాత్రం నిరాహారదీక్షలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించవలసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కాలువ పనులు పూర్తిచేసే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు చెందిన మహిళా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



యువ వికాసం
స్వయం ఉపాధికి ఊతం

యువత కోసం రాష్ట్ర ప్రభుత్వ పథకం

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంబన సాధించేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయమందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేయబోతోంది.

ప్రయోజనాలు

ఒక్కో లబ్ధిదారుకు గరిష్ఠంగా మూడు లక్షల రూపాయల వరకు ఆర్థిక సాయమందిస్తారు. ఈ మొత్తంతో చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించవచ్చు. ఎక్కువ మంది యువత ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంతంగా ఆదాయ మార్గాలను సృష్టించుకోవచ్చు. నిరుద్యోగ యువత స్థిరమైన ఆదాయం పొందడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడి వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత లభిస్తుంది.

పథకం అమలు ఇలా

ఈ పథకానికి అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. అర్జీదారులు తమ యూనిట్లకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సమర్పించాల్సి ఉంటుంది. సంబంధిత కార్పొరేషన్‌తోపాటు కలెక్టర్ల పర్యవేక్షణలో మండల స్థాయిలోని అధికారుల కమిటీ లబ్దిదారులను ఎంపిక చేసి తుది జాబితా ప్రకటిస్తుంది. అర్హుల ఎంపికకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాల్లో 16,800 మందికి లబ్ధి

రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలో 5 లక్షల మందికి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఒక్కో శాసనసభ నియోజకవర్గానికి సుమారు 4,200 మందికి లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది కరీంనగర్ జిల్లాల్లోని నాలుగు నియోజకవర్గాల్లో సుమారు 16,800 మందికి ఆర్థిక సాయం అందనుంది.



ముఖ్యమైన తేదీలు

నోటిఫికేషన్ విడుదల : మార్చి 15
దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం : మార్చి 15
చివరి తేదీ : ఏప్రిల్ 5.
లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ : ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు
మంజూరు పత్రాలు అందించడం : జూన్ 2 (తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం)

బోనాల జాతరకు వేళాయె...

● ముస్తాబైన పెద్దాపూర్ మల్లన్నస్వామి ఆలయం ● ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



పెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయం

మెట్‌పల్లి రూరల్, మార్చి, 14 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతరకు ఆలయం ముస్తాబైంది. గ్రామం మధ్యలో మల్లన్న స్వామి వెలిశారు. ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. మల్లన్న స్వామి జాతరలో పాల్గొనడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. జాతర కోసం గ్రామస్థులు, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు వారం రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు.

● నేటి నుంచి జాతర

జాతర 15న ప్రారంభమై 18న ముగియనుంది. 60 వేల నుంచి 70వేల మంది భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పిస్తారు. శనివారం ఉదయం ఆలయంలోని ఉత్సవ మూర్తులను ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి సమీపంలోని గోదావరికి తీసుకెళ్తారు. అక్కడ గంగా జలంతో స్వామి విగ్రహాలకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం తిరిగి ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకువస్తారు. అదే రోజు రాత్రి స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం నుంచి మల్లన్న స్వామి, శివలింగాన్ని భక్తులు దర్శించుకుంటారు. సాయంత్రం మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో భక్తి శ్రద్ధలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేస్తారు. బోనాలను భక్తులు నెత్తిన ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి సమర్పిస్తారు అనంతరం స్వామి వారిని ప్రత్యేక రథంలోఆలయం చుట్టూ తిప్పి బోనాల పండుగను ముగిస్తారు.

● అందరి సహకారంతో జాతర నిర్వహిస్తున్నాం

- మిట్టపల్లి నారాయణరెడ్డి, పెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్



ప్రతి ఏటా హోలీ తరువాత వచ్చే మొదటి ఆదివారం గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాలను జరపడం ఆనవాయితీ. ఈ జాతరను అధికారులు, గ్రామస్థుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నాం. మూడు రోజులు జరిగే జాతర ఉత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. జాతర కోసం వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రజలను చైతన్య పరిచే రచనలతోనే పాలకుల్లో మార్పు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జూకంటి జగన్నాథం

ఎల్లారెడ్డిపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరిచే రచనలతోనే పాలకుల్లో మార్పు వస్తుందని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం అన్నారు. ఎల్లారెడ్డిపేట లయన్స్ క్లబ్‌లో 1997-1998 పదో తరగతి పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో జర్నలిస్టు మంగురపు విష్ణుప్రసాద్ రచించిన 'తెగమురిసే మేక' కవితా సంకలనం పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూకంటి జగన్నాథం మాట్లాడుతూ ప్రజలు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజహితాన్ని కోరేది కవిత్వమని అన్నారు. సిరిసిల్లలో బీసీల జనాభా అధికంగా ఉన్నా ఎమ్మెల్యేలు కాలేకపోవడానికి కారణం చైతన్యం లేకపోవడమేనని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్‌కు నేటికీ సిరిసిల్లలో ఓటు హక్కు లేకపోవడం ఈప్రాంత ప్రజల్లో ఉన్న చైతన్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలు మేకల్లా మారినంత కాలం పాలకులు మోసం చేస్తూనే ఉంటారన్నారు. అనంతరం విష్ణుప్రసాద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సిరిసిల్ల డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ప్యాక్స్ చైర్మన్, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వివేక రచయితల సంఘం ప్రతినిధి పర్శరాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు మళ్లీ గండి

● రు. 20 లక్షలతో మరమ్మతులు చేసినా ఫలితం శూన్యం
● చివరి ఆయకట్టు రైతులకు సాగు నీరు ప్రశ్నార్థకం

కథలాపూర్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు మళ్లీ గండి పడింది. ఏటా నీటి ప్రవాహానికి నక్కల ఒర్రె ప్రాంతంలో గండి పడి చివరి ఆయకట్టుకు రైతులకు పంటల సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో గండి పడుతున్న ప్రదేశంలో శాశ్వత ప్రాతిపదికన సిమెంట్‌తో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి 20 లక్షల రూపాయలు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. కట్టడం పక్కన మొరం పూర్తి స్థాయిలో వేయకపోవడం వల్ల కొద్దిపాటి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిందని రైతులు అంటున్నారు.

● రైతులకు తప్పని కష్టాలు

నిజామాబాద్ జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ గుట్టల్లో రాళ్లవాగు ప్రాజెక్ట్‌ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞంలో భాగంగా నిర్మించారు. మండలంలోని భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పల్లి, కథలాపూర్ గ్రామాల్లోని 30 వేల ఎకరాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందుతుంది. నక్కల ఒర్రె ప్రాంతంలో కాలువ ప్రమాదకరంగా ఉండడంతో తరచూ తెగిపోతోంది. అక్కడ వంతెన మాదిరిగా శాశ్వతంగా నిర్మాణం చేపట్టినా పక్కన బలంగా మొరం వేయకపోవడంతో కోసుకుపోయింది. దీంతో భారీ గొయ్యి ఏర్పడి నీరంతా వాగులోకి వృధాగా పోతోంది. రెండు జిల్లాల పరిధిలో ఈ కాలువ పరిధి ఉండడంతో ఇరిగేషన్ అధికారులకు పర్యవేక్షణ ఇబ్బందిగా మారింది. మరమ్మతుల విషయంలో రెండు జిల్లాల అధికారులు కలసి అంచనాలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నిధుల మంజూరుకు ఆటంకాలు తప్పడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



కోనాపూర్ శివారులో రాళ్లవాగు కాలువకు ఏర్పడ్డ గండి

● రూ. 50 లక్షలతో అంచనాలకు ఎమ్మెల్యే ఆదేశం

- వాకిటి రాజరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్



గండి పడ్డ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రైతులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. కాంట్రాక్టర్ చేపట్టిన పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. వంతెన పక్కన మొరం వేయకపోవడం వల్లే గండి పడిందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వెంటనే 50 లక్షల రూపాయలతో కాలువ పూర్తిస్థాయి మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్‌ను ఒకే జిల్లా అధికారుల పరిధిలోకి వచ్చేలా చూడాలని ఎమ్మెల్యేను కోరాం.

కన్నుల పండువగా

నృసింహుడి తెప్పోత్సవం



ధర్మపురి బ్రహ్మపుష్కరిణి (కోనేరు) వద్ద భక్తులు

దోలోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

తిలకించిన వేలాది మంది భక్తులు

ధర్మపురి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీ నృసింహస్వామి (యోగ) తెప్ప, డోలోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుడు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేసి ఆలయం నుండి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకువచ్చారు. స్వామి వారల సేవలను హంస రూపంలోని వాహనంపై ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో బోయలు ఐదుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామివారల సేవలను పుష్కరిణి మధ్య ఉంచి మండపంలోని ఊయలపై డోలోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఉత్తర ద్వారం లోనికి ప్రవేశించి స్వామి వారిని దర్శించుకున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, శ్రీధర్, ఉమాసాగర్, సతీష్, దత్తాత్రి, కుమారస్వామి, పలువురు ఎస్ఐలు, బందోబస్తులో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి వారి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్పం తిరుపతి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

● కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భారీగా తరలివచ్చి గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఉగ్ర నారసింహుని ఆలయం వద్ద వల్లుబండ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారలకు ప్రీతి అయిన పట్టె నామాలు, కోరె మీసాలు సమర్పించారు. ఆర్థిక సౌభాగ్యం కోసం కుబేరుడికి, కష్టాలు తొలగి పోవాలని కోరుతూ నాగ దేవతకు, సకల సంపదల కోసం నృసింహుడికి మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయం పక్షాన సుమారు 15 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం వద్ద ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, సిబ్బంది తగు సేవలు అందించారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్ కుమార్, ఎస్ఐలు, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలగవ రోజు ఆలయానికి రూ. 5,11,031 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ. 1,85,465 ప్రసాదాలు విక్రయించగా రూ. 2,80,500 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ 45,066 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సల్లో భాగంగా 15న శనివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో శ్రీ కొత్త (ఉగ్ర) లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళావేదికపై నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.






ధర్మపురి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)లో తెప్పోత్సవం, డోలోత్సవాలను తిలకించేందుకు హాజరు అయిన భక్తులు, స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వంద శాతం ఇంటి పన్నుల వసూళ్లు

శశికుమార్, ఎంపీడీవో మల్లాపూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఇంటి పన్ను వసూళ్లు ఏ మేరకు పూర్తి అయినవి, లక్ష్యం చేరుకున్నట్లేనా ?

ఎంపీడీవో: ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక దృష్టి సారిస్తూ 90శాతం బకాయిల వసూలు పూర్తి అయ్యాయి. ప్రత్యేక ప్రణాళికతో వందశాతం చేరువలో ఉన్నాం.

ఆంధ్రజ్యోతి: ఏ గ్రామంలో ఇంటి పన్ను బకాయి అధికంగా ఉంది. అత్యల్ప బకాయి గ్రామం ఏది?

ఎంపీడీవో: హుస్సేన్‌నగర్ గ్రామంలో ఇంటి పన్ను బకాయిలు అతి తక్కువగా, మల్లాపూర్‌లో ఇంటి పన్నులు అధికంగా రావాల్సినవి ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: వేసవి దృష్ట్యా ఆయా గ్రామాల్లో తాగు నీటి కొరత ఏర్పాడకుండా ఎలాంటి ప్రణాళిక చేయనున్నారు?

ఎంపీడీవో: తాగునీటి కొరత తీర్చేందుకు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేశాం.

- మల్లాపూర్

లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ఎండపల్లి, మార్చి14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామంలో శుక్రవారం రోజున శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దేవాలయానికి వంటశాల గది, సీసీ రోడ్డు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విప్ వెంట మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, డాక్టర్ గురువారెడ్డి, రాజిరెడ్డి, చెంద్రారెడ్డి పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో అన్నదానం

కొడిమ్యాల, మార్చి14(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సుమారు 500 మంది గ్రామస్థులకు రావికంటి సురేష్ అన్నదానం చేశారు. ఉదయం నుంచి బాబాకు అభిషేకం, హారతి, పల్లకిసేవ, ప్రత్యేక పూజ కార్యక్రమాలను పూజారి శ్రీనివాస్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు గుండేటి రమేష్, ఏనుగు ఆదిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు



గోపాల్‌రావుపేటలో హోలీ వేడుకల్లో మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత



కోరుట్లలో చిన్నారుల సంబరాలు



రాయికల్‌లో మహిళల హోలీ సంబరాలు

జగిత్యాలరూరల్, మార్చి 14: జిల్లా వ్యాప్తంగా హోలీ సంబరాలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. జగిత్యాల రూరల్ మండలంలో యువకులు, యువతులు, మహిళలు ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగిత్యాల మండలంలోని గోపాల్‌రావుపేటలోని వారి స్వగృహంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్‌లు హోలీ వేడుకల్లో పాల్గొని చిన్నారులకు రంగులుపూసి హోలీ సంబరాలు జరుపుకున్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం హోలీ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామాల్లో యువకులు, నాయకులు, చిన్నారులు, మహిళాలు రంగులు చల్లుకుంటూ ఆనందత్సోవాల మధ్య హోలీ పండగను జరుపుకున్నారు.

కథలాపూర్ : మండలంలో చిన్నారులు, మహిళలు, యువకులు రంగులు చల్లుకుని ఆనందోత్సవాల మధ్య పండగను జరుపుకున్నారు. రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా రంగులు పూసుకున్నారు. గిరిజన తండాల్లో యువకులు రకరకాల రంగులను చల్లుకున్నారు. కథలాపూర్ ఎస్సారార్ ఫంక్షన్ హాల్‌లో రాజస్థాన్ యువకులు కోలాలు వేసుకుంటూ రంగులు చల్లుకుని నృత్యాలు చేశారు.

బీర్‌పూర్ : మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నాలు, పెద్దలు, మహిళలు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు రంగులు అద్దకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ ఎంపీపీ రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్, మాజీ జెడ్పిటీసీలు పాత పద్మ రమేష్, కొల్ముల రమణ, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా వివిధ రకాల రంగులు చల్లుకున్నారు.

రాయికల్: రాయికల్‌లో హోలీ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ రంగుల పండుగలో మునిగిపోయారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని హోలీ సందడిని మరింత రంగులమయం చేశారు. గల్లీ గల్లీలో రంగుల పాటలు మారుమోగాయి. పరస్పరం రంగులు చల్లుకుంటూ, ఆనందోత్సాహాలతో హోలీ ఆటలు ఆడారు. పిల్లలు రకరకాల రంగులతో ముద్దుగా ఆటలు ఆడుతుండగా, యువకులు రంగుల పిచికారిలతో ఉత్సాహం చూపించారు. రాయికల్ అంతటా రంగుల హంగులతో పండుగ సందడి నెలకొంది. హోలీ ఆనందాన్ని పంచుకుంటూ, అందరూ ఒకరినొకరు పలకరించుకుని పండుగకు కొత్త శోభ తెచ్చారు. రంగులమయమైన రాయికల్ హోలీ సంబరాలతో అంటరాన్నంటింది.

కోరుట్ల/ కోరుట్ల రూరల్ : కోరుట్ల, కోరుట్ల మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణాలతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం ఆర్ధరాత్రి కామదహనం నిర్వహించి కోలాటాలు అడుతూ యువతి యువకులు వేడుకలను నిర్వహించారు.



మెట్‌పల్లిలో కోర్టు వద్ద హోలీ వేడుకలు

గ్రామాలతో పాటు కోరుట్లలో యువతి యువకులు రంగులను చల్లుకుంటూ వేడుకలలో పాల్గొన్నారు. కోరుట్ల సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ధర్మపురి: మండలంలో హోలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయ సంఘాల నాయకులు, యువకులు, నేరెళ్ల స్నేహ మిత్ర గ్రూపు ఆధ్వర్యంలో సభ్యులు పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ధర్మపురి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు యువకులు, చిన్నారులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. యువకులు, యువతులు, విద్యార్థులు, బాలికలు ఉదయం నుంచి రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య నృత్యాలు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి బి. రాముకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, టీటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె శ్రీనివాస్, పీఆర్‌టీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు దోహగం గణేష్, టీపీయుఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బండి మహేష్, మ్యాన పవన్, గజబీంకార్ గోవర్ధన్, దాసరి భీమయ్య, రొట్టె శ్రీనివాస్, స్నేహ మిత్ర యూత్ వ్యవస్థాపక అధ్యక్షులు జాజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మల్యాల : హోలీ వేడుకలు మండలంలో యువత హుషారుగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిద గ్రామాలలో శుక్రవారం ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని అంగడి బజారు, బస్టాండ్ ప్రాంతాలలో యువతి-యువకులు కేరింతలు కొడుతు ఒక్కరిపై రంగులు చల్లుకుంటు ఉత్సాహంగా హోలీ పండగను జరుపుకున్నారు. పూడూర్, నల్లగొండ, నాచుపల్లి, రాంసాగర్, చెప్యాల, తిర్మాలాపూర్, నమిళికొండ తదితర గ్రామాలలోని బస్టాండ్ ప్రాంతాలలో యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకున్నారు.

వెల్గటూర్: మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా చిన్నారులు హోలీ.. హోలీ అంటూ రంగులు చల్లుకుంటూ, వాటర్ బాటిల్‌లలో రంగు నీళ్లు కలిపి వాటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ ఆనందంతో కేరింతలు కొట్టారు. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై ఉమాసాగర్ ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహించారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో హోలీ పండుగను శుక్రవారం ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పలు రాజకీయ పక్షాల నాయకులు, యువజన సంఘాల సభ్యులు జరిపిన హోలీ వేడుకలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని గ్రామాల్లో హోలీ సంబరాలు అంబరాన్ని తాకాయి. గ్రామాల్లోని పలు చోట్ల కామదహనాలు జరిపి వేడుకలు ఘనంగా జరిపారు.



మల్లాపూర్‌లో...



భీమారంలో హోలీ వేడుకలు



వెల్గటూర్‌లో హోలీ వేడుకలు



కొడిమ్యాలలో హోలీ జరుపుకుంటున్న యువకులు

భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో ఉత్సవాలు



ఇటిక్యాలలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కిషన్‌రావుపేటలో రథోత్సవం



మెట్‌పల్లి ఓంకారేశ్వరాలయంలో డోలోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాయికల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామంలో శుక్రవారం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, అర్చకులు గోపికృష్ణ, శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్ర్యమంలో మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ వేరుగంటి భూమారావు, సభ్యులు, మాజీ సర్పంచులు మోహన్‌రావు, జక్కుల చంద్రశేఖర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, మండల, పట్టణ కోఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మారంపెల్లి రాణిసాయి కుమార్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరి వేణు, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితులు కళ్యాణాచార్యులు, ఆలయ అర్చకులు జగన్మోహన్ ఆచార్యులు, చిలకమర్రి రఘునాథ ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని రథంపై కూర్చోబెట్టారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా రథాన్ని ఊరేగింపు నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, దేవస్థాన వ్యవస్థాపకులు వంశీవర్ధన్ రావు, విష్ణువర్ధన్ రావు, ఆలయ కమిటీ సభ్యులు బొడగం మల్లన్న, సురకంటి నాగిరెడ్డి, అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, కనపర్తి శ్రీనివాస్, ఉట్నూరి గంగాధర్, నేరెళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని కిషన్‌రావుపేటలో శ్రీ నాగపల్లి లక్ష్మీనర్సింహ స్వామి రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారికి కోర మీసాలు, పట్టె నామాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రథాన్ని లాగడానికి భక్తులు ఉత్సాహం చూపారు. అంతకు ముందు జగన్నాథం విష్ణువర్ధనా చార్యుల ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలకు ఊయ్యాలలో ఉంచి డోలోత్సవంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బీర్నంది నరసింహాచారీ, శ్రీనివాస్ చారీ, ఈఓ విక్రం, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్యలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లి, గంభీర్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. పండితులు మాధవాచార్యులు, సీతారామశర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, క్షేత్రపాలక బలి ప్రదానం, నివేదన, తీర్థప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గంభీర్‌పూర్‌లో వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఉత్సవాలకు భక్త జనం భారీ సంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, రాష్ట్ర ఫిషరీస్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి హరిప్రసాద్ వేర్వేరుగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపల్లిలో శుక్రవారం ఉదయాత్పూర్వం శ్రీవెంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు చిలకమర్రి సత్యనారాయణ, పండితులు రాజశేఖరాచార్య, కృష్ణశర్మ నేతృత్వంలో స్వామివారికి అభిషేకాలు, తిరుమంజనం, ఆలయ ప్రవేశం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని ఓంకారేశ్వరాలయంలో పౌర్ణమి పురస్కరించుకొని పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డోలోత్సవం జరిపారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, మెట్‌పల్లి అధ్యక్షుడు మైలారపు రాంబాబు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య... మరింత మెరుగ్గా

(5వ పేజీ తరువాయి)

2022 డిసెంబరులో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. సెప్టెంబరు 2023లో పరీక్షలు నిర్వహించారు. గత జూన్ 2024లో ఫలితాలు వెల్లడించినా పలు కారణాలతో వీటి నియా మక ప్రక్రియ ఆలస్యమైంది. ప్రస్తుతం ఇంటర్ విద్యా సంవత్సరం ముగుస్తుండడంతో కొత్త వారికి బోధన విధానాలపై శిక్షణ ఇచ్చి వచ్చే విద్యా సంవత్సరం నుంచి విధులు అప్పగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

తొలగనున్న బోధన ఇబ్బందులు

- బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి

నూతన లెక్చరర్ల నియామకంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రయోజనం చేకూరనుంది. బోధనకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలిగి పోనున్నాయి. కళాశాలలు మరింత బలోపేతం అవుతాయి. నియామకమైన లెక్చరర్లు కేటాయించిన కళాశాలల్లో ప్రిన్సిపాళ్లకు రిపోర్టు చేస్తున్నారు.

సంతోషంగా ఉంది



- జనమంచి సాయి శిల్ప, ఇంగ్లీష్ లెక్చరర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, జగిత్యాల

మెట్‌పల్లి మా సొంత ఊరు. లెక్చరర్ ఉద్యోగానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్‌గా నియామకం అయ్యాను. ఈ మేరకు కళాశాలలో రిపోర్టు చేశాను. ప్రభుత్వ లక్ష్యం మేరకు బాలికలకు సరియైన విద్య అందించాలన్న లక్ష్యంతో ఉన్నాను.

కోటేశ్వర స్వామిని దర్శించుకున్న డీఈవో రాము



పూజలు చేస్తున్న డీఈవో దంపతులు

వెల్గటూర్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటిలింగాలలోని శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని జిల్లా విద్యాధికారి రాము శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ డీఈవో దంపతులకు ఆశీర్వచనం అందజేసి, స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ధర్మపురి మండల విద్యాధికారి సీతాలక్ష్మి, ధర్మపురి మండల ఉపాధ్యాయ సంఘం నాయకులు గజ బీంకర్ గోవర్ధన్, దాసరి భీమయ్య, మ్యాన పవన్ కుమార్, సీఆర్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ గోవర్ధన్‌కు ఘన సన్మానం



గోవర్ధన్‌ను సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్‌ను శుక్రవారం పట్టణంలో కళానగర్ ఎల్లాపి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన గోవర్ధన్‌ను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుల రాజేందర్ రావు, బాస నర్సింగ్ రావు, జాజాల రాజ్‌గోపాల్ రావు, తూం రాజేందర్, బాస శ్రీనివాస్, వెల్కుల ప్రభాకర్, గంట హన్మంతు, గాదె వెంకటేశ్వర్లు, తేలు లక్ష్మణ్, వెల్కుల రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ ప్రీమియర్ లీగ్ విజేత జగ్గాసాగర్ జట్టు



విజేతగా నిలిచిన జగ్గాసాగర్ జట్టు



ట్రోఫీ అందుకుంటున్న తాండ్ర్యాల జట్టు

కోరుట్ల రూరల్/మెట్‌పల్లి రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో జరిగిన విలేజ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామ ఆర్‌ఆర్ రైడర్స్ జట్టు విజేతగా నిలిచినట్లు టోర్నమెంట్ నిర్వహకులు శుక్రవారం తెలిపారు. ప్రీమియర్ లీగ్‌లో 12 జట్లు పాల్గొగా మెట్‌పల్లి మండలం వేంపేట, జగ్గాసాగర్ ఆర్‌ఆర్ రైడర్స్‌లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో జగ్గాసాగర్ ఆర్‌ఆర్ రైడర్స్, వేంపేట టీంలు పోటీ పడగా జగ్గాసాగర్ ఆర్‌ఆర్ రైడర్స్ విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతతో పాటు రెండవ స్థానంలో నిలిచిన జట్టుకు గ్రామ మాజీ సర్పంచ్ తుక్కారాం గౌడ్ బహుమతులను అందించారు. జగ్గాసాగర్ గ్రామానికి వచ్చిన టీం సభ్యులను బీజేపీ మెట్‌పల్లి మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, రాజు, సాగర్, మహేష్, శ్రీనివాస్, టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ : మండలంలోని తాండ్ర్యాల క్రికెట్ జట్టు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచింది. బీమారం మండలంలోని మన్నెగూడెంలో ఎన్ఆర్ఐ తేలు నరేశ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ టోర్నీలో 40 జట్లు తలపడ్డాయి. దాదాపు నెల రోజులుగా కొనసాగిన ఈ టోర్నీలో తాండ్ర్యాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు రు. 10 వేల నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్ క్రీడలు ప్రారంభం

మెట్‌పల్లి టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీస్టేడియంలో శుక్రవారం జిల్లా అథ్లెటిక్ పోటీలను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్యం రెడ్డి ప్రారంభించారు. 14, 16, 18, 20 సంవత్సరాల విద్యార్థులకు అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ నెల 23 తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులకు ఎంపిక జరగుతుందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు స్వప్న, మరుపల్లి కార్తిక్, ప్రశాంత్, వేణు, అథ్లెటిక్ సంఘ సభ్యుడు గజల్ రాందాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.